క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మల్లు నందిని

మధిర: మధిర బంజారా కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అభిషేకం నిర్వహించిన అర్చకులు, స్వామి, అమ్మవార్లను అలంకరించారు. కాగా, బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవారికి మల్లు నందిని విక్రమార్క పట్టువస్త్రాలను సమర్పించారు. కౌన్సిలర్లు మల్లాది వాసు – సవిత, గుర్రం రామారావు, ముత్తయ్య, శ్రీనివాసరావు, రంగా హన్మంతరావు, పాటిబండ్ల సత్యబాబు, కళ్యాణపు పుల్లారావు, వీరారెడ్డి, బాలరాజు, పాల్గొన్నారు.

గీతా మందిరంలో యాగపూజలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీగీతా జ్ఞానమందిరంలో గల శ్రీపార్థసారథి స్వామి ఆలయంలో అధ్యాయనోత్సవ సహిత బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం యాగపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తికుంభ ప్రతిష్ఠ, అగ్ని ప్రతిష్ఠ, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గుడివాడ వెంకటేశ్వరరావు, కొత్తూరు రాజా, తిరునగరి వెంకటనర్సయ్య, సీతారామానుజాచార్యులు, లీలాకృష్ణ, కేశవరెడ్డి, సత్యావతి, పుష్పావతి, శంకర్‌రావు, పురుషోత్తమరావు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే రాగమయిని సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విరాట్‌నగర్‌లో గల శ్రీశివమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ వార్షికోత్సవం, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి 333వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అభిషేకాలు, అలంకారాలు, జీవసమాధి పూజలు నిర్వహించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మొగధంపురం రామకృష్ణ, కోడూరి మోహనాచారి, బజ్జూరి అప్పారావు, ఏడుకొండలు, అప్పలాచారి, బాణాల సత్యనారాయణ, నాగేంద్రాచారి, రాంబాబు, ప్రసాద్, నాగాచారి పాల్గొన్నారు.

సింగరేణి వైద్య శిబిరం

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని కిష్టారం ఓసీ ప్రభావిత ప్రాంతమైన ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ చెరుకుపల్లిలో శుక్రవారం సింగరేణి వైద్య శిబిరం నిర్వహించారు. పీఓ నర్సింహారావు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ శిరీష రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంక్షేమాధికారి సందీప్, స్టాఫ్‌నర్స్ శరణ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి సరుకులు అందిస్తున్న గ్రూపు సభ్యులు

కారేపల్లి: మండల పరిధిలోని కారేపల్లిక్రాస్‌రోడ్డు 'గుడ్ మార్నింగ్' గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన మృతుల కుటుంబాలకు శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన వినసపల్లి వెంకటేష్, సౌజన్య దంపతుల ఏడు నెలల చిన్నారి అనన్య అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందటంతో దహన సంస్కారాల నిమిత్తం గ్రూపు సభ్యులు ఆర్థిక సాయం అందించారు. వీరితో పాటు.. కారేపల్లి క్రాస్‌రోడ్డుకు చెందిన చింత లక్ష్మి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కాగా.. బాధిత కుటుంబ సభ్యులకు సాయమందించారు. కార్యక్రమంలో గ్రూపు సభ్యులు వడ్డె వెంకటయ్య, పుచ్చకాయల శ్రీనివాసరావు, చిప్పలపల్లి వెంకన్న, గుజ్జర్లపూడి రాకేష్, హైమద్ పాషా, బాబోజీ, పాముల సురేష్, హటకర్ నెహ్రూ, భద్రం, నరేష్, బట్టు మోహన్, గంగాధరిని ఉపేంద్రచారి, నిమ్మల వెంకటేష్, మల్లెకంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిధుల జాడేది..?

- రైతువేదికలకు ఏడాదిగా అందని నిధులు
- నెలకు ఇస్తానన్న రూ.9 వేలు ఇవ్వట్లే
- భారంగా మారిన నిర్వహణ
- ఇబ్బందుల్లో ఏఈఓలు

చింతకాని: జిల్లాలో రైతు వేదికలు అక్కరకు రాకుండా పోతున్నాయి. రైతులకు మండల వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈఓలు) అందుబాటులో ఉండి వివిధ పంటల సాగులో అవలంబించాల్సిన ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు సలహాలు, సూచనలు అందించేందుకు గాను గత ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసింది. రెండు, మూడు రెవెన్యూ గ్రామాలను ఒక క్లస్టర్‌గా చేసి క్లస్టర్‌కు ఒకటి చొప్పున రైతు వేదికలను నిర్మించారు. అయితే రైతు వేదికల నిర్వహణకు మాత్రం సకాలంలో నిధులను విడుదల చేయడం లేదు. దీంతో ఏఈఓలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్యం, ఇతర నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని ఏఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో ఆరు రైతు వేదికలు..

వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల ద్వారా రైతులకు పంటల సాగు కోసం సలహాలు, సూచనలు అందించేందుకు క్లస్టర్‌కు ఒకటి చొప్పున మండలంలో ఉన్నటువంటి 26 గ్రామ పంచాయతీల్లోని 16 రెవెన్యూ గ్రామాలకు చింతకాని, ప్రొద్దుటూరు, బస్వాపురం, నాగులవంచ, లచ్చగూడెం, జగన్నాథపురం గ్రామాల్లో ఒక్కో రైతు వేదికకు రూ.22 లక్షలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలను 2021 నుంచి అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతు వేదికల ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పంటల సాగులో రైతులకు సూచనలు అందజేస్తారు.

ఏడాదిగా అందని నిర్వహణ నిధులు..

ఒక్కో రైతు వేదిక నిర్వహణకు నెలకు రూ.9 వేలు చొప్పున ఖర్చు అవుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. వాటిలో విద్యుత్ బిల్లులకు రూ.1,000, రైతుల శిక్షణకు రూ.2,500, పారిశుద్ధ్య నిర్వహణకు రూ.3 వేలు, తాగునీటికి రూ.500, మరమ్మతులు, స్టేషనరీ, జిరాక్సులు మరియు ఇతర ఖర్చుల కోసం రూ.2 వేలు కేటాయించారు. ఈ మేరకు రైతు వేదికలకు గతేడాది ఏప్రిల్ వరకు నిధులు విడుదలయ్యాయి. అప్పటి నుంచి నిధులు నిలిచిపోవడంతో రైతు వేదికల నిర్వహణ భారంగా మారిందని ఏఈఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించడం ఇబ్బందికరంగా మారిందని ఏఈఓలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న రైతు వేదికల నిర్వహణ నిధులను త్వరగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

ఏడాదిగా నిధులు రావాల్సి ఉంది..



రైతు వేదికల నిర్వహణ కోసం ప్రభుత్వం నిధులను విడుదల చేస్తుంది. నిధులను విద్యుత్ బిల్లులు, పారిశుద్ధ్య నిర్వహణ, రైతులకు శిక్షణ, తాగునీరు, తదితర వాటికి ఖర్చు చేస్తున్నాం. గతేడాది ఏప్రిల్ వరకు నిధులు విడుదలయ్యాయి. అప్పటి నుంచి నిధుల జాడే లేకుండా పోయింది.

– పల్లెల నాగయ్య, మండల వ్యవసాయాధికారి, చింతకాని

నిధులు విడుదల చేయాలి..



రైతు వేదికలకు నిర్వహణ నిధులను ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలి. నిర్వహణ నిధులను సకాలంలో విడుదల చేయకపోతే రైతు వేదికలు నిరుపయోగంగా మారే అవకాశం ఉంటుంది. రైతులకు పంటల సాగులో సూచనలు, సలహాలను అందించేందుకు.. సమావేశాలను నిర్వహించే పరిస్థితి ఉండదు.

– నర్సింశెట్టి కృష్ణారావు, రైతు, మత్కేపల్లి

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఓటర్ స్లిప్పులు పంపిణీ ప్రారంభం

కల్లూరురూరల్: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కల్లూరు డివిజన్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని 6 మండలాల్లో 17,345 మంది గ్రాడ్యుయేట్‌లు ఓటర్లుగా నమోదైనారు. ఈ మేరకు ఆరు మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఏన్కూరులో 1,597 మంది గ్రాడ్యుయేట్లు, తల్లాడలో 2,686 మంది, కల్లూరులో 3,720 మంది, పెనుబల్లిలో 2,452 మంది, వేంసూరులో 2,286 మంది, సత్తుపల్లిలో 4,609 మంది గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ మేరకు తల్లాడలో 2 పోలింగ్ కేంద్రాలు, కల్లూరులో 2 పోలింగ్ కేంద్రాలు, పెనుబల్లిలో 2, వేంసూరులో 2, సత్తుపల్లిలో 10 పోలింగ్ కేంద్రాలు, ఏన్కూరులో 2 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల 27వ తేదీన ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఓటర్లకు బీఎల్ఓలు పోలింగ్ స్లిప్‌లు పంపిణీ ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ తరపున తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్), బీఆర్ఎస్ పార్టీ తరపున రాకేష్‌రెడ్డి, బీజేపీ తరుపున గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

ముదిగొండ: మండలపరిధిలోని అయ్యగాపల్లి–గంధసిరి బీటీ ప్రధాన రహదారి పక్కనే ఇటీవల గాలి దుమారానికి విద్యుత్ స్తంబాలు విరిగి పడ్డాయి. దీంతో ప్రమాదకర విద్యుత్ స్తంభాలపై పొంచి ఉన్న ప్రమాదం అనే శీర్షికన సాక్షిలో కథనం రావడంతో వెంటనే స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు ఏడీఈ భీంసింగ్, ఏఈ నారాయణల ఆధ్వర్యంలో విరిగిన రెండు విద్యుత్ స్తంబాలను, విద్యుత్‌లైన్‌లను సిబ్బందిచే మరమ్మతులు చేయించారు. విద్యుత్ లైన్‌లు క్లియర్ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



విరిగిన స్తంభాలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ఇల్లు ధ్వంసం



నాగిలిగొండలో ధ్వంసమైన ఇల్లు

చింతకాని: మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామంలో చాట్ల వందనంకు చెందిన రేకుల ఇల్లు గురువారం రాత్రి ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ధ్వంసమైంది. ఈదురుగాలులకు ఇంటికి అమర్చిన రేకులన్నీ లేచిపోయి.. ఇంట్లో ఉన్నటువంటి వంట సామగ్రి, బట్టలు ఇతర వస్తువులు వర్షానికి తడసి పాడైపోయాయని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం పరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

కొణిజర్లలో 48.6 మి.మీ వర్షం

– గుబ్బగుర్తిలో నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

కొణిజర్ల: కొణిజర్లలో గురువారం రాత్రి భారీవర్షం కురిసింది. రాత్రి 10 గంటల నుంచి సుమారు 2 గంటల పాటు కుంభవర్షం కురిసింది. కొణిజర్లలో 48.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. దీంతో పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. గత కొన్ని నెలలుగా వర్షం లేక ఇబ్బందులు పడుతున్న రైతులు గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని ఉంచిన రైతులు పత్తి విత్తనాలు పెట్టేందుకు సమాయత్తం అవుతున్నారు. మండలంలోని గుబ్బగుర్తి సబ్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాత్రంతా ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం ఉదయానికి అధికారులు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురం ఫీడర్ పరిధిలోని కొండకొడిమ, ఖానాపురం, స్టేజీపినపాక, కేజీ సిరిపురం, పూసలపాడు, గొండ్లపాలెం గ్రామాలకు 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

పెద్దగోపతి సబ్ స్టేషన్‌లో..

కొణిజర్ల: మండలంలోని పెద్దగోపతి సబ్ స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రాయల సురేష్ తెలిపారు.

గోకినేపల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో..

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు కరెంట్ ఉండదని విద్యుత్‌శాఖ ఏఈ ఎం.శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు.

చింతకానిలో..

చింతకాని: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌తో పాటుగా నాగులవంచ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతకాని, నాగులవంచ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.

ఐపీడీఎస్ 33/11 కేవీ సబ్ స్టేషన్..

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి ఐపీడీఎస్ 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శని వారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ శరత్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని సిద్ధారంరోడ్, శ్రీనివాసటాకీస్‌రెడ్డి, వెంకటేశ్వర టాకీస్‌రోడ్, రాజబాపయ్యరోడ్, కాకర్లపల్లిరోడ్, శివసాయినగర్, వాయుపుత్రా వెంచర్, హనుమాన్‌నగర్, తాళ్లమడ ఫీడర్ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

సీఎంతో భేటీలో మధిర నాయకుడు



సీఎంను కలిసిన షేక్ జహంగీర్

మధిర: టీపీసీసీ ఆధ్వర్యాన 'లంచ్ విత్ రేవంత్ రెడ్డి' కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని శుక్రవారం నిర్వహించగా మధిరకు చెందిన కాంగ్రెస్ నాయకుడు షేక్ జహంగీర్ పాల్గొన్నారు. జిల్లాస్థాయి సోషల్ మీడియా కోఆర్డినేటర్లతో సమావేశమైన ముఖ్యమంత్రి కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా వారియర్స్ కీలకపాత్ర పోషించారని తెలిపారు. ప్రజాపాలనలోనూ కోఆర్డినేటర్లు ముందు వరుసలో ఉండి అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సీఎం సూచించినట్లు జహంగీర్ వెల్లడించారు.

ముదిగొండ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కరుణాకర్‌రెడ్డి



కరుణాకర్‌రెడ్డి

ముదిగొండ: ముదిగొండ తహసీల్దార్‌గా తిరుమల కరుణాకర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రామారావు అస్వస్థతకు గురికావడంతో బోనకల్ నాయబ్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కరుణాకర్‌రెడ్డిని ముదిగొండ తహసీల్‌గా నియమించారు.

మోసపూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్

వైరా: మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందని వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ అన్నారు. శుక్రవారం వైరాలో నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 27న జరిగే ఖమ్మం, వరంగల్, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిరాకేష్‌రెడ్డి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపుకోసం ప్రతి పట్టభద్రుడిని కలిసి ఓటు అభ్యర్థించాలన్నారు.

జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

వైరారూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించడం జరుగుతుందని ముసలిమడుగు ట్రైబుల్ వెల్ఫేర్ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్రమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ కౌన్సిలింగ్‌కు ఈ నెల 23న ఉదయం 9 గంటలకు భద్రాచలం టీటీడబ్ల్యూయుఆర్‌జేసీ గర్ల్స్ నందు నిర్వహించనున్నట్లు, ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో బాలికలకు మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఒరిజినల్ టీసీ, స్టడీ కండక్ట్, కులం, ఆదాయం సర్టిఫికేట్లతో పాటు, ఆధార్, ఎస్ఎస్‌సీ మార్కుల మెమో లను వెంట తీసుకొని హాజరుకావాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 83339 25406, 9704648558, 81066 24127 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

కేసుల పరిష్కారానికి చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న ఏసీపీ రఘు

సత్తుపల్లిటౌన్: దర్యాప్తులో వేగం పెంచి కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కల్లూరు ఏసీపీ ఎ.రఘు అన్నారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో శుక్రవారం డివిజన్‌లోని పోలీస్ అధికారులతో నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్వేస్టిగేషన్ కేసుల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. డివిజన్‌లో రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలిన ఆదేశించారు. డ్రంక్‌అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌ను కట్టడి చేయాలని స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సత్తుపల్లిటౌన్, సత్తుపల్లి రూరల్ సీఐలు టి.కిరణ్, వెంకటేశం, వీరప్రసాద్, వెంకటేష్, షాకీర్ పాల్గొన్నారు.

బీపీ అదుపులో ఉండాలి



మధిరరూరల్: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వీరబాబు, సిబ్బంది



ఎర్రుపాలెం: నారాయణ పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మధిరరూరల్/తల్లాడ/ఎర్రుపాలెం: అధిక రక్తపోటు (బీపీ) సైలెంట్ కిల్లర్ అని మాటూరుపేట, తల్లాడ, నారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు వీరబాబు, రత్న మనోహర్, శకుంతల తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం వెంకటాపురం, మాటూరు గ్రామాలతో పాటు తల్లాడ, ఎర్రుపాలెంలోని నారాయణపురం పీహెచ్‌సీల్లో క్యాంపులు, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. రక్తపోటు ఉన్న వారిలో తలనొప్పి, వాంతులు, చాతిలో నొప్పి రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు మసక బారడం, ఆందోళనగా ఉండటం, చెవులలో శబ్దం రావడం వంటి లక్షణాలు ఉంటాయన్నారు. 30 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ బీపీని చెక్ చేసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు మందులు వేసుకోవాలని, సొంత నిర్ణయాలతో మందులను ఆపరాదని తెలిపారు. బీపీ అదుపులో లేకపోతే గుండె జబ్బులు, బ్రెయిన్ స్ట్రోక్, కిడ్నీ జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. సమతుల్య ఆహారం అంటే సోడియం తక్కువగా పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలని పేర్కొన్నారు. అదేవిధంగా నిత్యం వ్యాయామం, అధిక బరువు ఉంటే తగ్గించుకోవడం, నడక, జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్, స్వీట్స్‌కు దూరంగా ఉండాలన్నారు. ఒత్తిడి నివారణ చర్యలకు యోగ చేయాలని, పొగాకు ఉత్పత్తులు, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శరత్ బాబు, ప్రదీప్, భాస్కర్ రావు, వైద్య సిబ్బంది కె.పెద్దపుల్లయ్య, మేరమ్మ, వసంతకుమారి, భద్రమ్మ, కళావతి, కుమారి, రాజశ్రీ, అమృతరాజు, సంజయ్, కృష్ణ, ఏఎన్ఎం నాగమణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

వైరా: జిల్లాలో అకాల వర్షంతో నష్టపోయిన పండ్ల తోటలు, వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వైరా విక్రమ్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 11 మండలాల్లో వర్షం నష్టాన్ని మిగిల్చిందన్నారు. మామిడి, బొప్పాయి తోటలు నేలరాలాయన్నారు. రేకుల షెడ్డులు కుప్పకూలీ, విద్యుత్ తీగల తెగిపడి పశువులు మృత్యువాత పడ్డాయన్నారు. వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలన్నారు.

ఈ నెల 19, 20న రాజకీయ శిక్షణా తరగతులు..

వైరాలోని మిట్టపల్లి గార్డెన్స్‌లో రాజకీయశిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కేజీ రామచందర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణారెడ్డి, పార్టీ నిర్మాణంపై జిల్లా అధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వరరావు బోధిస్తారని తెలిపారు. ఈ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు సీవై పుల్లయ్య, కె.అర్జునరావు, మండల కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

రామనరసయ్య నగర్‌లో..

కొణిజర్ల: వర్షం కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మండలంలోని రామనరసయ్య నగర్‌లో నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం మండల కార్యదర్శి కోయిడ లక్ష్మీనారాయణ పాల్గొని మాట్లాడారు. మండలంలోని గుబ్బుగుర్తి, ఉప్పలచలక, పెద్దగోపతి, చిన్నమునగాల, పెద్ద మునగాల తదితర గ్రామాల్లో రైతులు నష్టపోయారన్నారు. ప్రభుత్వం తక్షణమే సర్వే చేయించి ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మేడి కొండలరావు, వడ్డె సత్యం, గోగుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులు పరిశీలన

ముదిగొండ: మండలపరిధిలోని గోకినేపల్లి, మేడేపల్లిలో జాతీయ ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి పరిశీలించారు. పంట కాలువల్లో ఉన్న పూడికతీత పనులు, చెరువుల్లోని పూడిక తీత పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరును, మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలకు పనుల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

పోడు ఉద్యమంలో భీమ్ సింగ్ పాత్ర మరువలేనిది



మాట్లాడుతున్న నాగన్న

కొణిజర్ల: కొణిజర్ల మండలం విక్రమ్ నగర్ ప్రాంతంలో పోడు ఉద్యమంలో భూక్యా బీమ్‌సింగ్ సేవలు మరువలేనివని అరుణోదయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగన్న కొనియాడారు. భూక్యా భీమ్ సింగ్ సంస్మరణ సభ విక్రమ్ నగర్‌లో శుక్రవారం లకావత్ బాసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూ.. పోడు సాగు, మద్యపాన నిషేధ ఉద్యమాల్లో బీమ్‌సింగ్ పాత్ర మరువలేనిదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసీ, గిరిజన హక్కులను కాలరాస్తుందన్నారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న గిరిజనులు, గిరిజనేతరులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర నాయకుడు విప్లవ్‌కుమార్, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ వైరా డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీమ్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్కే ఉమర్ పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పరకాల లక్ష్మి, నాయకులు బాబు, రామ్‌లాల్, మంగయ్య, శ్రీను, సామిని, సూర, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ



సమావేశమైన సింగరేణి ఐఎన్‌టీయూసీ నాయకులు

సత్తుపల్లిరూరల్: ఐఎన్‌టీయూసీ ఎల్లవేళలా కార్మికులకు అండగా నిలుస్తుందని కొత్తగూడెం బ్రాంచ్ సెక్రటరీ బట్టి విక్రమార్క, ఫిట్ సెక్రటరీ రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. సత్తుపల్లి సింగరేణి క్వార్టర్స్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, ఇతర మౌళిక సదుపాయాల పనులు త్వరగా జరిగేలా చూడాలని, నూతనంగా ఆర్వో ప్లాంట్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ తదితర పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సింగరేణి యాజమాన్యాన్ని కోరేలా చర్చించటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జాయింట్ సెక్రటరీ ఎర్ర భాస్కర్, నాగప్రకాష్, సీనియర్ నాయకులు చెన్నకేశవ, సిహెచ్‌పి ఫిట్‌సెక్రటరీ నాగేశ్వరరావు, అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీలు కోటి, సురేష్, రఘువీర్, ఐఎన్‌టీయూ ముఖ్య నాయకులు అశోక్, రఫీ, రామచందర్, దావూద్, పొట్టి కిరణ్, సందీప్, గుమ్మడి వెంకటేశ్వర్లు, బాలు, రాము, శివ తదితరులు పాల్గొన్నారు.